ధాన్యం కొనుగోలుకు మిల్లర్ల కొర్రీలు

- తాలు పేరిట దిగుమతికి నిరాకరణ
- మిల్లుల వద్ద నిలిచిన లారీలు
- వాతావరణ మార్పులతో ఆందోళనకు గురవుతున్న రైతాంగం


శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ యార్డులో పేరుకుపోయిన ధాన్యం బస్తాల నిల్వలు

శాలిగౌరారం: ధాన్యం నాణ్యతగా ఉన్నప్పటికీ రకరకాల కొర్రీలు పెడుతూ ధాన్యం దిగుమతి చేసుకోకుండా రైతులను మిల్లర్లు నానా ఇబ్బందులు పెడుతున్నారు. రైతుల ఇబ్బందులు,, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అక్రమంగా కోతలు పెట్టడానికి పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లర్లు తాలు, పొట్టి,పొడవు గింజల పేరిట దిగుమతి చేసుకోకుండా పేచీలు పెడుతున్నారు. ఈ విషయంపై రైతులు ఉన్నతాధికారులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో మిల్లర్లకు మరో అవకాశంగా మారుతోంది. దీంతో రైతులు మిల్లుల వద్దకు వెళ్లి మిల్లర్లతో తూకం కోతలకు ఒప్పందం చేసుకోవలసిన పరిస్థితులు వస్తున్నాయి.

15 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు

ప్రస్తుత యాసంగి సీజన్‌లో శాలిగౌరారం మండలంలో 15 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతోంది. అందులో ఐకేపీ–7, పీఏసీఎస్–5, ఎఫ్‌పీఓ–2, ఎన్‌డీసీఎంఎస్–1 ఉన్నాయి. ఇప్పటివరకు ఆయా కొనుగోలు కేంద్రాల ద్వారా 1,18,651 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో ప్రస్తుతం సుమారు 50 వేల క్వింటాళ్ల ధాన్యం రాశులు నిల్వ ఉన్నాయి.

మిల్లర్ల పేచీలు

శాలిగౌరారం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు ఎగుమతి కాకపోవడంతో కేంద్రాల్లోనే నిల్వ ఉన్నాయి. తూకంవేసి ఉన్న ధాన్యం బస్తాలతో కొనుగోలు కేంద్రాలు నిండిపోయాయి. ధాన్యం బస్తాల రవాణాకు లారీలు రాకపోవడంతో ఎక్కడి బస్తాలు అక్కడే నిలిచిపోయాయి. రోజుల తరబడి లారీల నుంచి ధాన్యం దిగుమతులు జరుగకపోవడం, కొనుగోలు కేంద్రాలకు లారీలు సకాలంలో రాకపోవడం ఒక కారణంగా తెలుస్తోంది. ఇదిలా ఉండగా కేంద్రాల్లో ఇప్పటికే ధాన్యం బస్తాలు నిల్వలు ఉండడం, వాతావరణం మార్పులతో కేంద్రాల నిర్వాహకులు తిరిగి ధాన్యం కొనుగోలు చేయకుండా నిలిపివేశారు. ఇప్పటికే అకాల వర్షాలు పడడంతో వర్షానికి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు పడిన రైతులు.. తడిసిన కొద్దిపాటి ధాన్యాన్ని ఆరబెట్టేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ధాన్యం కొనుగోలుతోపాటూ ఎగుమతులు వేగవంతం చేసి మిల్లర్ల చేతిలో నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

లారీల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



"ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి తక్కువ సమయంలో ఎక్కువ కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాం. వారం క్రితం వరకు లారీల సమస్య స్వల్పంగానే ఉంది. ఇటీవల లారీల సమస్య తీవ్రంగా మారింది. దీంతో కేంద్రాల నిర్వాహణలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. లారీల సమస్యను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– నిమ్మల ఆంజనేయులు, పీఏసీఎస్ సీఈఓ, శాలిగౌరారం.

ఇప్పటికే ఎంతో నష్టపోయాం



"నాకున్న 11 ఎకరాల్లో వరి పంట సాగుచేశా. పది రోజుల క్రితం శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం అమ్మడానికి తీసుకువచ్చా. కేంద్రంలోని నిర్వాహకులు ధాన్యం కొనుగోళ్లు వేగంగానే చేస్తున్నారు. కానీ లారీల సమస్యే రైతులను వెంటాడుతోంది. అకాల వర్షాలతో ఇప్పటికే ఎంతో నష్టపోయాం. పది రోజులుగా కేంద్రానికి లారీలు సరిపడా రావడంలేదు. సమస్యను ఉన్నతాధికారులు పరిష్కరించాలి.

–చామల సురేందర్‌రెడ్డి, రైతు, శాలిగౌరారం

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు సరికాదు

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు: అనునిత్యం మునుగోడు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మునుగోడు పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి హయాంలో మంజూరైన పనులకు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేసి.. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి శంకుస్థాపనలు చేస్తున్నారని అనడం సరైంది కాదన్నారు. ఎక్కడా శిలాఫలకాలను ధ్వసం చేయలేదని, నిజం తెలియకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తన సొంత డబ్బులతో క్యాంపు కార్యాలయం ఆధునీకరణ చేపట్టారు తప్ప.. ఎక్కడా ప్రభుత్వ నిధులు వినియోగించలేదన్నారు. మునుగోడు పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు ప్రజల అంగీకారం మేరకే చేపడుతున్నామని, ఎవరికీ నష్టం జరిగేవిధంగా చేపట్టడం లేదన్నారు. నియోజకవర్గంలో సాగునీరు అందించేందుకు ఇప్పటికే చర్లగూడెం, కిష్టరాయినిపల్లి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయడంతోపాటు బి వెల్లాంల ఉదయసముద్రం నుంచి కిష్టాపురం చెరువులోకి నీరు నింపేందుకు మంత్రి ఉత్తమ్‌ని రాజగోపాల్‌రెడ్డి ఒప్పించారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులకు అందించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచిస్తున్నారన్నారు. నిస్వార్థంతో పనిచేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు ప్రభాకర్‌రెడ్డికి లేదన్నారు. ఈ సమావేశంలో చండూరు మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, వట్టికోటి శేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, కాంగ్రెస్ నాయకులు మిర్యాల వెంకన్న, పందుల భాస్కర్, నకరెకంటి యాదయ్య, నడిపల్లి యాదయ్య, మేడి యాదయ్య, హైమద్, మాదగోని రాజేష్ గౌడ్, ఆరేళ్ల సైదులు, ముచ్చపోతుల శ్రీనివాసులు, గోపగోని పాపయ్య, మందుల బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఎడిటర్‌పై పోలీసుల తీరు అప్రజాస్వామికం


చండూరు : నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్ష నాయకులు

చండూరు : సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై దాడిచేసిన పోలీసుల తీరు అప్రజాస్వామికం అని సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్‌కుమార్, రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ కట్ట భిక్షం అన్నారు. ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసుల దాడిని నిరసిస్తూ గురువారం చండూరు పట్టణ కేంద్రంలో అఖిల పక్షాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎడిటర్ ఇంటిపై దాడి.. పత్రికా స్వేచ్ఛపై దాడిగా పరిగణించాల్సిందే అన్నారు. జర్నలిస్టు సంఘాలు జాతీయ స్థాయి వరకు ఈ సమస్యను తీసుకెళ్లాలన్నారు. పత్రికలు ఎల్లప్పుడూ ప్రతిపక్షమేనన్న సాధారణ సూత్రాన్ని మరిచి చంద్రబాబు ప్రభుత్వంపై వ్యతిరేక వార్తలు రాస్తున్నారనే నెపంతో దాడులు జరపడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి బొడ్డు వెంకన్న, కార్యవర్గ సభ్యులు కర్నాటి వెంకటేశం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్.ఊషయ్య, లింగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇడికూడ రవీందర్, బీఆర్‌ఎస్ నాయకుడు ఇడికోజు నాగరాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సంగు జానయ్య, జర్నలిస్టులు వెంకటేశం, ఆవుల శేఖర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై కక్ష సాధింపు చర్యలు సరికాదు

కట్టంగూర్ : ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియాపై పాలకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర నాయకుడు ఇల్లెందుల గోపినాథ్ అన్నారు. గురువారం కట్టంగూర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసంలో ఏపీ పోలీసులు నిర్బంధ సోదాలు జరపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని వెలికి తీసి ప్రజలకు నిజాలను చెరవేసే మీడియా సంస్థలు, వాటి బాధ్యులపై పాలకులు అక్రమ కేసులతో వేధింపులకు పాల్పడడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమన్నారు. ఇలాంటి ధోరణులకు వ్యతిరేకంగా జర్నలిస్టు సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సోదాలు జరిపి భయభ్రాంతులకు గురిచేయడం చంద్రబాబు నియంత పోకడలకు నిదర్శమన్నారు.

ప్రభుత్వంపై న్యాయ పోరాటం చేస్తాం

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మునుగోడు: బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి పనుల ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తొలగిస్తున్నారని, వాటిని యథావిధిగా ఏర్పాటు చేసేవరకు ప్రభుత్వంపై న్యాయ పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలతో మునుగోడులో ఆయన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం బీఆర్‌ఎస్ పాలనలో కోటి రూపాయలతో నిర్మించి ఏడాదిపాటు అందులో నుంచి పరిపాలన కొనసాగిస్తే, దానిని పునర్ నిర్మాణం పేరుతో మరో రూ.కోటి ఖర్చుచేసి దానిని తానే నిర్మించినట్లు ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా వివిధ గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు చేయిస్తే ఆ పనులు ముందుకు సాగకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవిపై ఉన్న ప్రేమ నియోజకవర్గ అభివృద్ధిపై లేదన్నారు. తమ పరిపాలనలో నియోజకవర్గానికి సాగునీరు అందించే చర్లగూడెం, కిష్టరాయినిపల్లి రిజర్వాయర్ పనులు చేపడుతుంటే అడ్డుకున్నారని ఆరోపించారు. రాజగోపాల్‌రెడ్డి తన సొంత నిధులతో బి వెల్లాంల ఉదయసముద్రం నుంచి పులిపలుపుల గ్రామ చెరువులోకి నీరు నింపుతున్నానని చెప్పి కనీసం గుంతల వరకు కూడా నీరు నింపలేకపోయాడన్నారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ మందుల సత్యం, పగిళ్ల సతీష్ కుమార్, యడవల్లి సురేష్, ఈద శరత్‌బాబు, పోలగోని సైదులుగౌడ్, మారగోని అంజయ్య గౌడ్, వనం లింగయ్య, పందుల సురేష్, వనం సురేష్, మేకల శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, లింగయ్య, కరుణాకర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన రామకృష్ణ, నాగేశ్వర్‌రావు బైక్‌పై హైదరాబాద్‌కు వెళుతున్నారు. మార్గమధ్యలో చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. దీంతో ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు దైద రవీందర్ క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందజేసి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డంపింగ్ యార్డ్‌లో మంటలు

నకిరేకల్ : మండలంలోని నెల్లిబండ శివారులో ఉన్న మున్సిపాలిటీ డంపింగ్ యార్డులో గురువారం మంటలు వ్యాపించి చుట్టుపక్కల రైతుల కంచెలు దహనమయ్యాయి. వివరాలు.. నెల్లిబండ శివారులోని నకిరేకల్ మున్సిపాలిటీ డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. ఈ డంపింగ్ యార్డులో ప్రతిరోజు మంటలు పెట్టడం వల్ల చుట్టుపక్కల రైతులు అటు వైపు నుంచి వెళ్లలేని పరిస్థితి. వచ్చే పొగతో చుట్టుపక్కల రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గురువారం ఆ యార్డులో చెలరేగిన భారీ మంటలు పక్కనే ఉన్న రైతు యానాల వెంకట్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి తాకాయి. కంచెతోపాటు ఇటీవల కోసిన మూడు ఎకరాల్లో వరికొయ్యలకు మంటలు వ్యాపించాయి. వరికోతలు కోయకుండా ఉంటే తమ పంట మొత్తం దహనం అయ్యేదని బాధిత రైతు యానాల వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డులో మంటలు చుట్టుపక్కల వ్యాపించకుండా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

బోర్ మోటార్లు మంజూరు

మర్రిగూడ : మండల కేంద్రంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో రెండు బోర్ మోటార్లను గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి యూసుఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మాస నీలిమాచంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ వెంకటపేటం బాలయ్య, పానుగోటి శేఖర్, ఎండి.షర్ఫొద్దీన్, సిలివేరు మహేష్, ఎడ్ల ముత్తయ్య, ఎండీ.బాబా, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు


వేడుకల్లో పాల్గొన్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి , ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : మండలంలోని నోముల గ్రామంలో శ్రీ విజయ కనకదుర్గాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. బ్రహ్మశ్రీ భోవనగిరి గోపాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, యంత్ర, ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహోత్సవాలను తిలకించారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యలు వేర్వేరుగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తలు కొడదల భిక్షమయ్య, బాదిన వెంకటరమణ, కుంచం సోమయ్య, యాసా కరుణాకర్‌రెడ్డి, యల్మకంటి జానయ్య, మాచర్ల యాదగిరి, బాదిని రాము, కందికట్ల నర్సింహ, కోమటిరెడ్డి కిరణ్‌రెడ్డి , ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ క్యాంప్ ప్రారంభం


క్రికెట్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : పట్టణంలోని మినీ స్టేడియంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత క్రికెట్ క్యాంప్‌ను గురువారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు చామల శ్రీనివాస్, బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ అమీనుద్దీన్, కోచ్ కారంపుడి సాయికుమార్‌లు పాల్గొన్నారు.

సాయివర్షిత్‌కు అండగా ఉంటా


వర్షిత్‌ను సన్మానిస్తున్న కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మునుగోడు: పేద కుటుంబంలో జన్మించి విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చుతున్న సాయివర్షిత్‌కు తగిన సహాయ సహకారాలు అందిస్తానని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మునుగోడుకు చెందిన దుబ్బ సాయివర్షిత్ ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ఎంఎల్‌టీలో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. గురువారం ఆ విద్యార్థి ఇంటికి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి వెళ్లి రూ. 10వేల ఆర్థిక సహాయం అందించి శాలువాతో సన్మానించి అభినందించారు. ఆయన వెంట మందుల సత్యం, పగిళ్ల సతీష్ కుమార్, యడవల్లి సురేష్, పందుల సురేష్ తదితరులు ఉన్నారు.


ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా నకిరేకల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు



ఆత్మీయ సమ్మేళనం

శాలిగౌరారం: మండలంలోని గురుజాల జెడ్పీహెచ్‌ఎస్‌లో 1999–2000 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు గురువారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు అశోక్, రాంరెడ్డి, సాంబయ్య, వెంకన్నలను పూలమాలలు, శాలువాలు, మెమోంటోలతో సన్మానించారు.

సోషల్ మీడియాలో వార్తలు నమ్మవద్దు


మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి


మాట్లాడుతున్న ఎస్ఐ లింగారెడ్డి

నల్లగొండ: సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు నమ్మవద్దని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ వన్‌టౌన్, టూటౌన్ పోలీసులతో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఇరు మతాల మధ్య విద్వేషపూరిత వాతావరణం రెచ్చగొట్టే విధంగా, ఇతర మతాల మనోభావాలు దెబ్బతినే విధంగా పోస్టులు పెట్టకూడదని సూచించారు. సోషల్ మీడియాపై పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. అనవసర పోస్టులు పెట్టి కేసులపాలు కావొద్దని, మతాల మధ్య స్నేహపూరిత వాతావరణం ఉండేవిధంగా చూసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. పట్టణంలో కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనుమానం వస్తే పోలీసులకు సమాచారం తెలపాలన్నారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు శంకర్, సైదులు, పీస్ కమిటీ సభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, ఖయ్యూం బేగ్, రియాజుద్దీన్ పాల్గొన్నారు.

హిందూ ముస్లింలు సమన్వయంతో ఉండాలి

రామగిరి(నల్లగొండ): హిందూ ముస్లింలు సమన్వయంతో ఉండాలని రూరల్ ఎస్ఐ లింగారెడ్డి అన్నారు. నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం శాంతి సంఘం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చే వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరు కూడా ఆవేశపూరిత మేసేజ్‌లు పెట్టవద్దని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ శేఖర్, కానిస్టేబుళ్లు సుమన్, శ్రీకాంత్, యాదయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మూడు టిప్పర్ల పట్టివేత

కనగల్: మండల కేంద్ర శివారులోని కనగల్ ఎర్రగుట్ట నుంచి అనుమతులు లేకుండా రాత్రి సమయంలో మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ విష్ణుమూర్తి గురువారం తెలిపారు. మైనింగ్ శాఖ, తహసీల్దార్ నుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా మట్టి తరలిస్తున్నారని తెలిపారు. అక్రమ మట్టి రవాణాకు బాధ్యులైన మండల పరిధిలోని పర్వతగిరి గ్రామానికి చెందిన శ్రీశైలం, మూడు టిప్పర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేసి టిప్పర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రచార పోస్టర్ విడుదల

చిట్యాల: పట్టణంలో ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్న శ్రీ బాలనర్సింహస్వామి ఆలయ ఉత్సవాల ప్రచార పోస్టర్‌ను గురువారం నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, దుర్గా ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు, శ్రీబాలనర్సింహస్వామి ఆలయ చైర్మన్ ఇమ్మడి వెంకన్న, బెల్లి సత్తయ్య, ఏర్పుల పరమేష్, బొబ్బల రాంరెడ్డి, పాల శివ, ఆలయ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరం పరిశీలన

చిట్యాల: వేసవిలో శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల ఎంఈఓ పానుగోతు సైదానాయక్ కోరారు. చిట్యాల మండలం చిన్నకాపర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో వేసవి శిబిరంలో భాగంలో నిర్వహిస్తున్న ఇండోర్ గేమ్స్, కంప్యూటర్ విద్య, డ్రాయింగ్, డ్యాన్స్ శిక్షణ కార్యక్రమాలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్


ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న ఎంపీ చామల

శాలిగౌరారం: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. నకిరేకల్ నుంచి శాలిగౌరారం, మోత్కూరు మీదుగా హైదరాబాద్‌కు నడిచే నల్లగొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సర్వీసును మండల కేంద్రంలో గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కొణతం జాన్‌రెడ్డి, నల్లగొండ డిపో మేనేజర్ శ్రీనాథ్, ఏడీసీ శౌరయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, నూక కిరణ్, అన్నెబోయిన సుధాకర్, గూని వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరిగె నర్సింహ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తేయాలని వినతి


వినతి పత్రం అందజేస్తున్న దీపేందర్

నల్లగొండ టౌన్: రాజీవ్ యువ వికాసానికి సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలని కోరుతూ బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్ గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. సిబిల్ స్కోర్ నిబంధన పెట్టడం వల్ల దరఖాస్తుదారులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలిజాల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు విశ్వనాథుల శివకుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు బోల్ల నాగరాజు, ఉపాధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు ఉన్నారు.

కిశోర్‌కుమార్‌కు ఇంటర్నేషనల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కిశోర్‌కుమార్

నల్లగొండ టౌన్: పట్టణానికి చెందిన ఆర్మ్‌డ్ రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ పల్లె కిశోర్‌కుమార్ జోష్ ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్నారు. కిశోర్‌కుమార్ తబలా వాయిద్యకారుడిగా, గాయకుడిగా జానపద కళాకారుడిగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో గురువారం జోష్ ఇంటర్నేషనల్ అవార్డును చైర్మన్ సంజూష్ అందజేశారు. కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు, జబర్దస్త్ కళాకారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిట్యాల ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం అందజేశారు. ఓర్సు యాదయ్యకు రూ.35,000, శిరస్సు అండాలుకు రూ.60,000, మురాల రజితకు రూ.38,000 వేల విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఏర్పుల నర్సింహ, గుండెబోయిన వీరమల్లు, గుత్తా రవీందర్‌రెడ్డి, ఈరటి మల్లయ్య, గుండెపురి లింగస్వామి, ఏర్పుల యాదయ్య, ఏర్పుల ఈదయ్య పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు అందజేత

నార్కట్‌పల్లి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా నార్కట్‌పల్లిలో పనులు చేస్తున్న కూలీలకు గురువారం ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి హరికృష్ణ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దైద నాగరాజు, పోలే రాజు, గోపాల్, ఫీల్డ్ అసిస్టెంట్ అండాలు తదితరులున్నారు.

నర్సరీ పరిశీలన

మర్రిగూడ : నర్సరీల్లో విత్తనాలు మొలకెత్తని ఖాళీ బ్యాగుల్లో తిరిగి విత్తనాలు నాటాలని దేవరకొండ డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం మర్రిగూడ మండలంలోని లెంకలపల్లిలో నర్సరీ మొక్కలు, వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీని ఆయన పరిశీలించి మాట్లాడారు. అంతకుముందు ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో తాగునీరు, విద్యుత్, శానిటేషన్ తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుల రిజిస్టర్‌ను నిర్వహించి ఆ రిజిస్టర్‌లో నమోదైన సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ జి.చినమునయ్య, ఎంపీఓ బి.రవికుమార్, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి ఉన్నారు.

శివలీలకు జోష్ ఇంటర్నేషనల్ ఫిలిం అవార్డు


అవార్డు అందుకుంటున్న శివలీల

కనగల్: మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ కంబాల శివలీలకు జోష్ ఇంటర్నేషనల్ ఫిలిం అవార్డును గురువారం హైదరాబాదులో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు అవార్డు అందించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

కార్మికులకు అండగా ఉంటాం

రామగిరి(నల్లగొండ) : కార్మికులకు న్యాయ సేవాధికార సంస్థ అండగా ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.పురుషోత్తమరావు అన్నారు. నల్లగొండ ఎఫ్‌సీఐలో జరిగిన న్యాయ విజ్ఞాన శిబిరంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ మేనేజర్ బసిరెడ్డి కాశిరెడ్డి, చీఫ్ లీగల్ సెల్ ఎయిడ్ డి ఫెన్స్ కౌన్సిల్ నిమ్మల భీమార్జున్‌రెడ్డి, కార్మిక నాయకులు మాదగోని భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.